మినీ కథ

గిఫ్ట్

డి.యస్.రావ్

అరుణ హడావుడిగా బస్సుదిగి స్టేషన్‌లోకి పరుగెత్తుకు వచ్చింది. ప్లాట్‌ఫారం మీదకు వచ్చి నాలుగువైపులా పరికించి చూసింది. ఇంకా బండి రాలేదు. జనం గుంపులు గుంపులుగా నిలబడి, కొంతమంది వాళ్ళ. సామాన్ల మీద, సిమ్మెంటు బెంచీల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అరుణ, తను ఆలస్యం కానందుకు గుండెలనిండా గాలి పీల్చుకుంది. ఇంతకీ, ఆమెకి అసలైన ప్రయాణీకులు, సరోజా వాళ్ళు కనబడలేదు. సరోజ ఎందుకింత, లేట్ చేసింది, ఒకసారి విసుగ్గా వాచీ చూసుకుని, ఇంకా, ఇంకా వస్తున్న ప్రయాణీకుల వైపు చూడసాగింది. బండి రావడానికి ఎంతో టైమ్ లేదు, ఇంకా ఎందుకు రాలేదు.. దానికసలు బుద్ధి లేదు. బండికి వెళ్ళే వాళ్ళు ముందుగా రావద్దా! అని మనస్సులోనే తిట్టుకోసాగింది.

ఆమె చూపులు అప్రయత్నంగా తన చేతిలో వున్న 'గిఫ్ట్' వైపు తిరిగాయి. 'గిఫ్ట్'ని ఒకసారి ఆప్యాయంగా చేతితో నిమిరింది. దానిమీద స్వహస్తాలతో "ప్రియమైన సరూకి ప్రేమతో-అరుణ" అని వ్రాసిన అక్షరాలు అందంగా కనిపిస్తున్నాయి. తన బెస్టు ఫ్రెండ్, కొలీగ్ అయిన సరోజకి విజయవాడ బదిలీ అయిపోయింది. సరోజ దూరం అవుతుంటే నగం ప్రాణం పోయి నటుల్గా వుంది. సరోజ వారంక్రితమే రిలీవ్ అయి పోయింది. ఇప్పుడు తల్లిని, తమ్ముడిని తీసుకుని విజయ వాడ వెళ్ళిపోతుంది. ఈ వారం అయినా తనతో సరదాగా 'స్పెండ్' చేద్దామంటే, శనిలా ఇన్ స్పెక్షన్ తగలబడింది. దానితో తనకి అసలు ఊపిరి తీసుకోవడానికి కూడ ఖాళీ లేకుండాపోయింది.

ఈ రోజు వెళ్ళిపోతున్న సరోజకి, స్టేషన్‌కి వచ్చి, తను తెచ్చిన గిఫ్ట్ ఇచ్చి, సెండాఫ్ ఇద్దామని సరాసరి ఆఫీసునుండి ఉరకలు, పరుగులు మీద వచ్చింది. ఒక్కసారి కోలాహలంఎక్కువయేసరికి,అరుణతన ఆలోచనల నుంచి తేరుకుని చూసేసరికి బండి వచ్చి ఆగింది. అరుణ కంగారుగా జనం వైపు చూసింది. ఇంత జనంలో తను సరోజని చూడలేదేమోనని, ప్లాట్‌ఫారం ఈ చివరి నుండి ఆ చివరి వరకు పరుగుపెట్టింది. ఎక్కడాసరోజ కళ్ళబడలేదు; ఇంక బండి కదలడానికి సిద్ధంగా వుంది. గార్డు విజిల్ వూదేశాడు.

ఇంతలో వృద్ధ దంపతులిద్దరు సామానుతోను, పద మూడు, పధ్నాలుగేళ్ళ వెర్రివాడిలా వున్న కుర్రవాడితో హడావుడిగా వచ్చారు. ఆ వృద్ధుడు అరుణని చూసి "చూడు తల్లీ! కాస్త సాయం చేయమ్మా, బండి కదిలిపోతుంది" అన్నాడు కంగారుగా ప్రాధేయ పడుతూ. అరుణ తన చేతిలోని గిఫ్ట్ ప్యాకెట్టు కుర్రవాడి చేతికిచ్చి, ముసలాయనకి సామానులుఅందజేసింది. బండి చాలా రష్‌గా వుండడాన్ని ఎలాగో కష్టంమీద, ముసలాయన అరుణ సాయంతో కుటుంబాన్ని, సామాన్లని బండిలోకి జేరవేసాడు. "తల్లీ! నీ దయ వల్ల బండి ఎక్కగలిగాము, ప్రభువు నీకు మేలు జేస్తాడు..." ముసలాయన ఇంకా ఏదో అనబోతుండగానే బండి కదిలిపోయింది. అరుణకి వాళ్ళని ఎక్కించగలిగినందుకు తృప్తిగా అన్పించింది. కాని, ఆ తృప్తి అట్టేసేపు నిలువ లేదు. దానికి కారణం హఠాత్తుగా తన గిఫ్ట్ గుర్తుకు వచ్చింది.

నెలాఖరులో అప్పుచేసి సరోజకోసం డెబ్భై రూపాయలు పెట్టి కొన్న గిఫ్ట్ పెట్టె అది. ఆ కుర్రవాడి చేతిలోనే వుండిపోయింది. తనకి ఆ కంగారులో దాని మాటే గుర్తులేకపోయింది. దిగులుగా వెనక్కి తిరిగి చూసింది. బండి అప్పుడే దూరంగా మలుపు తిరుగుతోంది. బరువెక్కిన మనస్సుతో, దిగులుతో ఎలాగో ఇంటికి చేరింది. ఇంట్లో అడుగు పెడుతుండగానే, అరుణ తమ్ముడు ఎదురొచ్చి "అక్కా, సరోజక్క నీవు ఆఫీసుకి వెళ్ళిన తర్వాత కబురుచేసింది. వాళ్ళ తాతగార్కి ఆరోగ్యం బావుండలేదట.. వెంటనే రమ్మని కబురు వచ్చిందట, అందుకని సాయంత్రం బండికి బదులు, మధ్యాహ్నం బస్సుకి ఏలూరు వెళ్తున్నామని నీకు చెప్ప మంది. నిన్ను కలవడానికి తనకి కుదరలేదట; చేరగానే ఉత్తరం వ్రాస్తానని చెప్పమంది. నేను మధ్యాహ్నం స్కూలుకు వెళ్ళేటప్పుడు నీకు ఈ సంగతి చెబుదామని అనుకొని మర్చిపోయాను. నువ్వు ఇప్పుడు స్టేషన్‌కు వెళ్ళొచ్చారలేదులే" అన్నాడు ఇంక చెప్పడం తన డ్యూటీ అయిపోయినట్లుగా. అది విన్న అరుణకి ఒక్క సారి అందరినీ నమిలి మ్రింగేద్దామన్నంత కోపం వచ్చింది.